పిఠాపురం కాలనీ మార్కెట్‌కు హంగులు



పిఠాపురంకాలనీ మార్కెట్‌లో కొత్తగా నిర్మిస్తున్న షెడ్లు



రహదారిపై చిరువ్యాపారుల వ్యాపారం



మార్కెట్లో షెడ్ల నిర్మాణం

- రూ.19 లక్షలతో శరవేగంగా పనులు
- మొత్తం షాపులు 54
- శిథిలావస్థలో ఉన్న 24 షెడ్లకు మరమ్మతులు
- మార్కెట్‌కు విద్యుద్దీకరణ
- కొత్తగా ఫ్లాట్ ఫారం నిర్మాణం, టైల్స్ ఏర్పాటు



మద్దిలపాలెం : జీవీఎంసీ 22వవార్డులోని పిఠాపురంకాలనీ కూరగాయల మార్కెట్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని హంగులతో వినియోగదారుల సౌలభ్యాన్ని, వ్యాపారుల కావాల్సి వసతులను దృష్టిలో పెట్టుకుని శిథిలమైన మార్కెట్‌ను ఆధునికీకరణ చేస్తున్నారు. సుమారు 30 ఏళ్లుగా పిఠాపురం కాలనీలో కూరగాయల మార్కెట్ ఉంది. ఈ మార్కెట్‌ను 2003లో అప్పటి నగర మేయర్ రాజాన రమణి ఆధ్వర్యంలో షెడ్లు ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో ఆ షెడ్లు పెంచి పెద్ద మార్కెట్‌గా మార్పు చేశారు. అయితే ఈ మార్కెట్ ఆలనాపాలనా చూసే దిక్కు లేకపోవడంతో నిర్మించిన 54 షెడ్లలో 24 శిథిలమయ్యాయి. దీంతో మార్కెట్‌ను పూర్తి మూసేసి వ్యాపారులందరూ పిఠాపురం కాలనీ రోడ్డు పక్కనే కొన్నేళ్లుగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను తిరిగి అందుబాటులో తీసుకురావడానికి మహానగర పాలక సంస్థ నిధులు కేటాయించింది. మార్కెట్ ఆధునికీకరణకు రూ.19 లక్షల మంజూరయ్యాయి. ఈ నిధులతో మార్కెట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి.

పూర్తి వసతుల ఏర్పాటు

మార్కెట్‌కు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని వసతులు కల్పించడానికి మరమ్మతులు చేస్తున్నారు. ప్రవేశ ముఖద్వారం ఏర్పాటుతోపాటు నిర్మాణ ద్వారాన్ని ఆధునికీకరించారు. మార్కెట్‌లో విభాగాల వారీగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయలు, పువ్వులు, కిరాణ, పూజా సామాగ్రి, మాంసం, చేపలు తదితర విభాగాల వారీగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

జనవరి 1వతేదీకి మార్కెట్ పునఃప్రారంభం

వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి మార్కెట్ అన్ని హంగులతో పునఃప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. ఇంత వరకూ ఉన్న వ్యాపారుల ప్రస్తుతం రోడ్లకిరువైపులా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారికి పక్కాగా దుకాణాలు అందుబాటులోకి వస్తున్నాయని సంబరపడుతున్నారు. మరో వైపు రోడ్డుకిరువైపులా దుకాణాలుండడంతో వాహన చోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పడుతుందని కాలనీవాసులు అంటున్నారు.

విద్యుద్దీకరణ పనులు

మార్కెట్‌లో విద్యుద్దీకరణ చేస్తున్నారు. ప్రతి షెడ్డులో దుకాణాలకు లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్ అంతా విద్యుత్ వెలుగులతో నింపేందుకు పనులు చేపడుతున్నారు.

24 షెడ్లకు పూర్తిగా మరమ్మతులు

మార్కెట్‌లో ఉన్న 54 షెడ్డులలో 24 షెడ్డులు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో ఆ 24 షెడ్లకు పూర్తి మరమ్మతులు చేస్తున్నారు. దీనిలోభాగంగా షెడ్లకు ప్లాట్‌ఫారం నిర్మాణంతోపాటు, కొత్త టైల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్ అంతా సుందరీకరణ చేస్తున్నారు.

ఆర్థికంగా బలపడతాం



30 ఏళ్లుగా ఇదే మార్కెట్‌ను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. మార్కెట్‌లో దుకాణాలు శిథిలం కావడంతో ప్రస్తుతం రోడ్డున పడ్డాం. ఇప్పుడు మళ్లీ మరమ్మతులు చేయడంతో ఒక నీడా దొరుకుందని ఆనందంగా ఉంది. త్వరితగతిన పనులు పూర్తయితే మార్కెట్‌లో షాపులు పెట్టుకుని ఆర్థికంగా బలపడతాం.
– బొడ్డు కాసులమ్మ, పూజా సామగ్రి విక్రయదారి

ఆనందంగా ఉంది



మార్కెట్‌లో దుకాణాల ఏర్పాటుతో ఫలాన నంబర్ షాపు అంటే ఒక గుర్తింపు ఉంటుంది. ఇప్పుడు రోడ్డుపై రోజు ఒక దగ్గర నానా మాటలు పడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నాం. గతంలో 7 నంబర్‌లో అంటే పరవాడ లక్ష్మి అని వినియోగదారులు గుర్తుండేది. మార్కెట్ త్వరలో పునఃప్రారంభం కానుండడంతో ఆనందంగా ఉంది.
– పరవాడ లక్ష్మి,

పనులు పూర్తి చేయాలి



రోడ్డు పక్కన వ్యాపారం చేయడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. చాలా ఏళ్లుగా మార్కెట్‌లో ఉంటూ వ్యాపారం చేసుకునే వాళ్లం. వర్షానికి దుకాణాలు కారిపోవడంతోపాటు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపక్క వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు జరుగుతున్నాయి.
– జి. మణి, పూల వ్యాపారి

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం దగ్ధం



దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. హనుమంతవాక నుంచి అడవివరం వైపు బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం ఉదయం ఓ యువకుడు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నాడు. విశాఖ కేంద్ర కారాగారం సమీపంలోని రామకృష్ణాపురం వద్దకు చేరేసరికి ఆ వాహనం నుంచి పొగలు రావడం గమనించి వాహనం రోడ్డుపై నిలిపేశాడు. క్షణంలో మంటలు, దట్టమైన పొగలు రావడంతో ఆ యువకుడు భయంతో అక్కడ నుంచి పారిపోయాడు. స్థానికులు అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేసి ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని సంఘటనను పరిశీలించారు. ఇదిలా ఉండగా ఆ వాహనచోదకుడు పారిపోవడంతో దీనికి వాహనం ఎవరిదో అనే విషయం తెలియరాలేదని పోలీసులు తెలిపారు. వాహనచోదకులు నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. వాహనంలో షార్ట్ సర్క్యూట్ జరిగిన కారణంగా మంటలురేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి సాధనకు కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రెండు, మూడు నెలల్లో సాధారణ స్థితికి చేరేలా కృషి చేస్తున్నామని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఇందుకు కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఉక్కు పరిపాలనా భవనంలో కార్మిక సంఘాలతో సీఎండీ, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాయబరేలి వీల్ ప్లాంట్, హెచ్‌బీ కాలనీలకు సంబంధించి సానుకూల నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉత్పత్తికి సంబంధించి సెయిల్, జేఎస్‌పీఎల్‌లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. వాటిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పెండింగ్ అంశాలను లేవనెత్తారు. దీనిపై కార్మిక సంఘాలు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్–3 పునరుద్ధరణ, కార్మికులకు వేతన సవరణ తదితర అంశాలపై యాజమాన్యం తీరును విమర్శించారు.

హోలీ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



చర్చిలో కేక్ కట్ చేస్తున్న జాన్‌వెస్లీ

జగదాంబ : ఏసుక్రీస్తు శాంతి సందేశం ఇచ్చారని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం జీవీఎంసీ 39వ వార్డు పాతపోస్టాఫీసు దరి హోలీక్రైస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చర్చి బిషప్ బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులకు వేతనాలు ఇచ్చిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. క్రైస్తవుల కోసం నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ. నాలుగు వందల కోట్లు ఖర్చు చేసిందన్నారు. క్రైస్తవులందరూ జగనన్న సేవలను గుర్తించి ఆయనకు మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల జాబితా పరిశీలన

అల్లిపురం : ఓటర్ జాబితా పరిశీలన ప్రక్రియ 33వ వార్డులో శనివారం చురుగ్గా కొనసాగింది. ఎంజీఎం హై స్కూల్లో జరిగిన కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు కృష్ణకుమారి, చందు, ఎమినిటీ సెక్రటరీలు రమ్య, సాహిద్ పాల్గొని ఓటర్ జాబితాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, కొడమంచిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యాలతో రాణింపు



అజయ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఓఎస్‌డీ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: వ్యక్తిగత నైపుణ్యాలు వృత్తిపరమైన అభివృద్ధికి దోహదపడతాయని కోమిరాస్ ప్రిన్సిపల్ హార్డ్‌వేర్ ఇంజినీర్ అజయ్ గుమ్మళ్ల అన్నారు. శనివారం ఆయన ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో విద్యార్థులనుద్దేశించి ప్రత్యేక ప్రసంగం అందించారు. వేగంగా మారుతున్న వృత్తిపరమైన పరిధిలో వ్యక్తిగత నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. రెండు విభిన్నమైన రంగాల్లో రాణించే విధానాన్ని తెలియజేశారు. నేటీ పోటీ వాతావరణంలో విజయానికి అవసరమైన ఆవశ్యక అంశాలను వివరిస్తూ, స్టార్టప్‌లు స్థాపన తదితర అంశాలను పరిచయం చేశారు. ఈ దిశగా విద్యార్థులు అడుగులు వేసే దిశగా ప్రోత్సహించారు. ఏయూ సిబ్‌లో విద్యార్థులకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో అధికారులను అభినందించారు. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎదురయ్యే సవాళ్లు, వాటికి విద్యార్థులు సన్నద్ధం అయ్యే విధానాలను వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు అజయ్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.సారబంది తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు ఉపక్రమించాలి



మొక్కలు నాటుతున్న ఇంచార్జి వీసీ ఆచార్య సమత

ఏయూక్యాంపస్: కాలుష్య నియంత్రణకు యువత ఉద్యమించాలని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. శనివారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తన కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది కాలుష్యం కారణంగా కోట్లాదిమంది మృత్యువాత పడుతున్నారన్నారు. అంటువ్యాధుల కంటే అధికశాతం మంది కాలుష్యం కారణంగా మృతి చెందడం జరుగుతోందన్నారు. కాలుష్యం పెరిగితే ఏర్పడే పర్యవసానాలు యువతకు తెలుసుకొని, వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత స్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఏయూ రంజని అతిథి గృహం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, పీజీ బీఓఎస్ చైర్‌పర్సన్ ఆచార్య డి.నాగరాజ కుమారి, డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాలమన్ రాజు, డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వినీల పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



రాంబాయ్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ కనకారావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకోజీపాలెం దరి అంజనేయస్వామి గుడి ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగుల రాంబాయ్ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంబాయ్ రెండేళ్ల వయసున్న తన మనమడిని ఆస్పత్రికి తీసుకెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంకోజీపాలెం అంజనేయస్వామి గుడి వద్ద రోడ్డు దాటుతుండగా ఇసుకతోట నుంచి వెంకోజీపాలెం వైపు వేగంగా వచ్చిన జీవీఎంసీ చెత్త తరలింపు లారీ ఢీకొట్టింది. దీంతో రాంబాయ్ కాలు కింద భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. స్థానికులు స్పందించి ఆమెను మెడికవర్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స అందిస్తున్నారు. ఎంవీపీ ట్రాఫిక్ ఎస్‌ఐ కనకారావు ఆస్పత్రికి చేరుకొని ఆమె నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ప్రాణాపాయం లేదని అయితే కాలుకు తీవ్రగాయమైందని వైద్యులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేయండి



అధికారులను ఆదేశిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగల సీజన్ కనుక నగర ప్రజలకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చాలా కాలంగా పూర్ణామార్కెట్ రోడ్డు విస్తరణకు నోచుకోక వ్యాపారులు, వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. విస్తరణ పనుల్లో అడ్డంకులు, ఆటంకాలు ఏమైనా ఉన్నాయా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



23వ వార్డులో సభలో మాట్లాడుతున్న గన్నమనేని వెంకటేశ్వరరావు, సత్యారెడ్డి



13వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సునీత

మద్దిలపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్ర ప్రజలకు మేలు చేసిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గోపాలపురం పరిశీలకుడు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శనివారం 23వ వార్డులో స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డిల ఆధ్వర్యంలో మద్దిలపాలెం 1086137 చైతన్యనగర్ సచివాయంల పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా పార్టీ పతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్యమంత్రిగా జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఓ వైపు సంక్షేమ పథకాలు, మరో వైపు అభివృద్ధి సమపాళ్లలో చేసి చూపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే ఏపీ విశేష అభివృద్ధి సాధిస్తుందన్నారు. వార్డులో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో..

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డులో శనివారం స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పన్నెండో నంబరు సచివాలయం పరిధి పైనాపిల్‌కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి కార్పొరేటర్ పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు కొనసాగడానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ కావాలని తెలిపారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వాటివల్ల వార్డులో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అందుకే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, కొల్లూరు సుబ్బారావు, శ్రీనివాసరావు, పద్మ, రాము, కామేష్, నారాయణ, డేవిడ్, బంగారమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల శిబిరం రేపు

దాబాగార్డెన్స్: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఏఎల్ఐఎమ్–సీఓ సహకారంతో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో 9 నుంచి 13వార్డులు, 15 నుంచి 23, 28 వార్డులో గల దివ్యాంగుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్స్, మోటార్ సైకిల్స్, బ్లైండ్ స్టిక్స్, వినికిడి యంత్రాలు, మానసిక వికలాంగులకు అవసరమైన కిట్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, తెల్లరేషన్ కార్డు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. అలాగే http:/ www. swavlambancard. gov. in/ pwd/ applicationnew URL link నందు పేరు ముందుగానే నమోదు చేసుకొని రిజిస్టర్ అయిన దరఖాస్తు ఈ శిబిరానికి తీసుకురావాలని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

తాళం వేసిన ఫ్లాట్లే టార్గెట్

- బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లోవ్‌లోని ఆరు ఫ్లాట్‌లలో చోరీకి యత్నం
- పరిశీలించిన క్రైం డీసీపీ నాగన్న



బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్

సింహాచలం: తాళం వేసి ఉన్న ఫ్లాట్లనే టార్గెట్‌గా ఇద్దరు దొంగలు చోరీకి ప్రయత్నించిన సంఘటన శనివారం 98వవార్డు అప్పన్నపాలెంలో సంచలనం రేకెత్తించింది. గేటెడ్ కమ్యూనిటీగా ఉన్న బాలాజీ హిల్‌వ్యూ ఎన్‌క్లోవ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, అసోసియేషన్ సభ్యులు తెలిపిన వివరాలు.. అప్పన్నపాలెంలోని బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లోవ్‌లో శనివారం తెల్లవారు జామున సుమారు రెండున్నర గంటల సమయంలో ఇద్దరు దొంగలు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకుని సీ,డీ బ్లాకుల్లో మొత్తం ఐదు అంతస్తులు తిరిగారు. సీ బ్లాక్‌లో తాళం వేసి ఉన్న రెండు ఫ్లాట్‌లను తెరిచేందుకు పూనుకోగా అవి రాలేదు. ఒక ఫ్లాట్ డోర్ తెరచుకోవడంతో లోపలికి ప్రవేశించారు. అలాగే డీ బ్లాక్‌లోని మూడు ఫ్లాట్‌ల ప్రధాన ద్వారం గడియలు తెరిచి లోపలికి వెళ్లారు. ఇంతలో కార్తీక మాసం పూజలకోసం లేచిన ఒక మహిళ ఎవరని అరవడంతో ఇద్దరూ పరుగులు తీశారు. దొంగలు ప్రధాన ద్వారాలు తెరచి ప్రవేశించిన ఫ్లాట్‌ల్లోని వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నట్టు సమాచారం. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రైం డీసీపీ నాగన్న, ఏడీసీపీ గంగాధర్, ఏసీపీ సునీల్, పెందుర్తి ఎస్‌ఐ సల్మాన్‌బేగ్ వచ్చి పరిశీలన చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లతో పరిశీలన చేశారు. కాగా దొంగలు లోపలికి ప్రవేశించిన నాలుగు ఫ్లాట్‌ల నివాసితులకు అపార్ట్‌మెంట్ వాసులు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత ఏమైనా వస్తువులు పోయాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కాగా రెండు ఫ్లాట్ల తలుపులు తీసేందుకు దొంగలు ప్రయత్నించారని, ఒక ఫ్లాట్ తలుపు మాత్రమే రావడంతో లోపలకు ప్రవేశించారని పెందుర్తి క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ చెప్పారు. ఇదిలావుండగా హిల్‌వ్యూకి పక్కన ఉన్న ఖాళీ స్థలం ఉండటంతో ప్రహరీకి నిచ్చెన వేసుకుని దొంగలు ప్రవేశించినట్టు చెబుతున్నారు. కాగా పోలీసులు హిల్‌వ్యూలోకి మీడియాను అనుమతించలేదు.

పాలసీదారులను కాపాడుకోవాలి

దాబాగార్డెన్స్ : ఎల్ఐసీపై నమ్మకంతో పెట్టుబడి పెట్టిన పాలసీదారులను కాపాడుకోవడం మన ముఖ్య కర్తవ్యమని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సతీష్ తెలిపారు. యూనియన్ 49వ సర్వసభ్య సమావేశం శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూనియన్ అధ్యక్షురాలు కామేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే బీమా రంగాన్ని పూర్తిగా నాశనం చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడడానికి కార్మికుల హక్కులు పణంగా పెడుతుందని ఆరోపించారు. యూనియన్ నాయకులు కోదండరామ్, బి. హరనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.